క్లుప్తంగా

సర్వే శతశాతం పూర్తిచేయాలి



ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కాళీప్రసాద్

హిరమండలం: పీఏసీఎస్ సర్వేతో పాటు సిటిజన్ హౌస్ హోల్డ్ సర్వే శతశాతం పూర్తిచేయాలని ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ తెలిపారు. మండలంలోని గులుమూరు సచివాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందజేయాలన్నారు. హౌసింగ్ కాలనీ, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. ఈఓపీఆర్డీ గోవిందరావు, సర్పంచ్ ఎస్.కోటేశ్వరరావు ఉన్నారు.

నువ్వు విత్తనాల పంపిణీ



రైతులుకు విత్తనాలు అందజేస్తున్న నాయకులు

బూర్జ: మండలంలోని ఓ.వి.పేటలో రైతులకు సబ్సిడీపై నువ్వుల విత్తనాలను వైస్ఎంపీపీ బుడుమూరు సూర్యారావు శనివారం పంపిణీ చేశారు. నీటి సంఘం అధ్యక్షుడు బి.వి.ఎస్.ఎన్ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందజేసిన విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం వైస్ చైర్మన్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, డైరెక్టర్ బి.సత్యనారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

పరీక్షా–పే చర్చపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజశేఖర్

సరుబుజ్జిలి: పరీక్షల పట్ల విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు లోనుకాకుండా ప్రధాన మంత్రి మోదీ ఏర్పాటుచేసిన పరీక్షా–పే చర్చ–2025లో పాల్గొనాలని రొట్టవలస జెడ్పీ హైస్కూల్ ప్లస్‌టూ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజశేఖర్ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వమరవల్లి డైట్ విద్యార్థినులు పాల్గొన్నారు.


ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ఎత్తులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: మండలంలోని కలిగాం కూడలి వద్ద ఉన్న జగనన్న కాలనీ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందినంత ఎత్తులో ఏర్పాటు చేశారు. దీని చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. చేతికి అందినంత ఎత్తులో ట్రాన్స్‌ఫార్మన్ అనే శీర్షికతో ఈ నెల 12 తేదీన సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్థానిక ట్రాన్స్‌కో అధికారులు శనివారం స్పందించారు. మరోచోట ఎక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన



సత్యవరం స్కూల్లో సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం సైన్స్ ఎగ్జిబిషన్లు నిర్వహించారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ శాంతారావు పరిశీలించారు. ఇటువంటి ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో పరిజ్ఞానాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎప్పటికప్పుడు ఇటువంటివి నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించవచ్చన్నారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. సత్యవరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వకులా రత్నమాల ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు పాల్గొని పలు ఈవెంట్లను ప్రదర్శించారు.

నేడు తూర్పుకాపు సమ్మేళనం

కొత్తూరు: ఈ నెల 29 తేదీన ఎచ్చెర్ల మండల కేంద్రంలోని ఎన్‌హెచ్ 16 రోడ్డుకు అనుకొని ఉన్న ప్రాంతంలో తూర్పుకాపు మహా సమ్మేళనం నిర్వహించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి కులస్తుందరూ తరలిరావాలని ఆహ్వాన కమిటీ ప్రతినిధి యర్లంకి మాలీశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

ప్రణాళికలతో
ఉత్తమ ఫలితాలు



హిరమండలం కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక
- టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక బోధన
- ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతుల నిర్వహణ
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

హిరమండలం: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పదో తరగతి ఎంతో కీలకం. ఉన్నత చదువులకు పునాది రాయిగా భావించే పదో తరగతి పరీక్షలకు అటు ఉపాధ్యాయులు, ఇటు తల్లిదండ్రులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక విడుదల చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేయడంతో రెండో శని, ఆదివారాల్లో సైతం అదనపు తరగతుల నిర్వహిస్తున్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి దీన్ని అమలుచేస్తున్నారు. అందులో భాగంగా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు మిగిలిన విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా దృష్టిసారిస్తున్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయి పెంచడంతోపాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక ఎంతో దోహదపడుతుందని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

మెరుగైన ఫలితాలే లక్ష్యం..

వచ్చే సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో డిసెంబర్ నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఖరారయ్యాయి. మార్చి 17 నుంచి 31 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకుని మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్స్ నిర్వహిస్తున్నారు.

ప్రణాళికతో బోధన



పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహం ఎంతో బాగుంది. ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. నేను మంచి ఫలితాలు సాధించేందుకు, ఉత్సాహంగా చుదువుకోవడానికి సహకరిస్తున్నారు

– వంగ ప్రవల్లిక, కేజీబీవీ, హిరమండలం

సబ్జెక్టుల వారీగా బోధన



పదో తరగతి విద్యార్థులకు ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా వందరోజుల ప్రణాళిక ద్వారా బోధన చేస్తున్నాం. ఎలా చదవాలనే విషయాల గురించి చెబుతున్నాం. కష్టమైన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– ఎస్.కృష్ణవేణి, కేజీబీవీ ప్రత్యేక అధికారి, హిరమండలం

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే దిశగా కృషిచేస్తున్నాం. వంద రోజుల ప్రణాళిక అమలుచేస్తూనే సెలవు రోజుల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా వెనుకబడిన వారిని ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం.

– టి.కేశవరావు, హెచ్ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హిరమండలం

పాతపట్నం నియోజకవర్గంలోని ఉన్నత పాఠశాలలు, విద్యార్థుల వివరాలు ఇలా..

మండలం	పాతపట్నం	కొత్తూరు	హిరమండలం	మెళియాపుట్టి	ఎల్.న్.పేట
పాఠశాలలు	14	11	06	18	06
విద్యార్థులు	952	856	257	713	277

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి

- ఐసీడీఎస్ కేంద్రాల వద్ద నిర్మించిన టాయిలెట్లపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తాం
- మండల సమావేశంలో తీర్మానించిన ఎంపీపీ, సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీపీ ఆరంగి మురళి

నరసన్నపేట: ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల స్థాయిలో ఎంపీపీలు, జెడ్పీటీసీలు ఉంటున్నా.. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అవసరమైతే ఆందోళన చేస్తామని నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు జరుగుతున్నా.. సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియజేయడం లేదని సభ్యులు మండిపడ్డారు. తీర్మానాలకు తమ వద్దకు వస్తున్నారని, మిగిలిన సమాచారం తెలియచేయడం లేదని ఎంపీటీసీలు రువ్వ వాసు, నేతింటి రాజేశ్వరరావు, వైశ్యరాజు కేశవరాజు, సర్పంచ్‌లు పోలాకి నర్సింహమూర్తి, వాన గోవిందరావు తదితరులు అన్నారు. వ్యవసాయం, రెవెన్యూ, ఐసీడీఎస్, ఉపాధి హామీ శాఖలపై చర్చ సందర్భంగా ప్రొటోకాల్‌పై అధికారులను సభ్యులు నిలదీశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు తమ తీరు మార్చుకోవాలని, ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. మండలంలో రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, కనీసం షెడ్యూల్ కూడా తనకు ఇవ్వలేదని ఆవేదన చెందారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు, టాయిలెట్లు నిర్మించారని, వీటి గురించి ఆయా సర్పంచ్‌లకు ఎందుకు తెలియజేయలేదని, కనీసం నా వద్దకు అయినా ఆ జాబితా తీసుకురాలేదన్నారు. ఈ నిర్మాణాల నాణ్యతపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయడానికి సమావేశంలో ఎంపీపీ తీర్మానం ప్రతిపాదించగా సభ్యులు అంగీకరించారు. వ్యవసాయ కార్యక్రమాలు జరుగుతున్న సమయంలో సమాచారం ఇస్తున్నామని ఏఓ సునీత అన్నారు. సూర్యఘర్‌ను వినియోగించుకోవాలని ఏఈ కోటేశ్వరరావు తెలిపారు. తామరాపల్లిలో ఎస్సీల శ్మశానం ఆక్రమణల్లో ఉందని, జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేట వద్ద జగనన్న కాలనీ సమీపంలో శ్మశానాకి స్థలం కేటాయించాలని సర్పంచ్‌లు కోరారు. ఐసీడీఎస్ కేంద్రాల్లో సున్నా నుంచి ఆరేళ్ల లోపు ఉన్న పిల్లల కోసం ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని పీఓ నాగమణి తెలిపారు. ఉపాధి సోషల్ ఆడిట్ జరగనుందని సర్పంచ్‌లు సహకరించాలని ఏపీఓ యుగంధర్ కోరారు. మాకివలసలో స్కూల్ భవనాలు నాడు–నేడు కింద నిర్మాణం చేపట్టామని, వీటిని వినియోగంలోనికి తీసుకురాకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ మోహన్‌రావు అన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్, 2024–25 సవరణ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. ఈ సమావేశంలో ప్రత్యేక సలహాదారు యాళ్ల కృష్ణంనాయుడు, ఎంపీడీఓ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్నలత

జలుమూరు: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మంచి సమాజం కోసం చదువు అవసరమని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. తహసీల్దార్ జన్ని రామారావు, ఎంపీడీఓ అప్పలనాయుడు, ఏపీఓ హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.

చందనంతో అలంకరణ



సారవకోట మండలంలోని చీడిపూడి కల్యాణ వెంకటేశ్వర స్వామికి శనివారం 5 కేజీల చందనంతో అలంకరించారు. ఈ ఆలయంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ వేంకటేశ్వర స్వామి మూలవిరాట్‌ను చందనంతో అలంకరించినట్లు అర్చకులు పీసపాటి రామానుజాచార్యులు తెలిపారు. ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించామన్నారు. – సారవకోట

గోతులమయం..



సరుబుజ్జిలి నుంచి కొమనాపల్లి వరకు గల ఆర్అండ్‌బీ రహదారిలో బుడ్డివలస జంక్షన్ నుంచి గ్రామం వరకు గల 2 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారి అధ్వానంగా మారింది. ఏమాత్రం వర్షం కురిసినా వాహనాలతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని కోరారు. – సరుబుజ్జిలి

భౌపెడుతున్నాయ్..



హిరమండలం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిత్యం పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. మేజర్‌పంచాయతీలో వీధి కుక్కలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. చిన్నారులు పాఠశాలలకు వెళ్లిరావాలన్నా, మహిళలు ఇంటినుంచి బయటకు రావాలన్నా హడలిపోతున్నారు. ముఖ్యంగా వాహనాలపై వెళ్లిన వారి వెంటపడటంతో మరింత భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – హిరమండలం

శిథిలావస్థ..



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని సవలాపురం జంక్షన్ వద్ద శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జి. ఈ బ్రిడ్జిపై ప్రయాణం చేసే సమయంలో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. శిథిలమైన బ్రిడ్జి వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డు లేకపోవడంతోపాటు భారీ బరువు గల వాహనాలు ఒకేసారి ప్రయాణాలు చేస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని పలువురు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బ్రిడ్జిని మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. – సరుబుజ్జిలి

పశుగ్రాసం పెంపకంలో లక్ష్యాలు సాధించాలి

- పశుసంవర్ధకశాఖ ఏడీ కరుణాకరరావు



మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: పశుగ్రాసం పెంపకంలో నిర్దేశిత లక్ష్యాలను ప్రతిఒక్కరూ సాధించాలని పాతపట్నం పశువైద్యశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు ఆదేశించారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశు సంవర్థకశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పశువైద్యులు, సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్క పాడిరైతు పశుగ్రాసం పెంచుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. పశుగ్రాసం పట్ల పాడి రైతులుకు ఆసక్తి కలిగేలా అవగాహన కల్పించాలన్నారు. మినీ గోకులాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పాడి రైతులుకు బ్యాంకుల రుణాలు అందేలా చూడాలన్నారు. పశువైద్యులు శ్రీవాణి, అనిల్ కుమార్, మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కుప్పిలి కవితా గానం



కవితా గానం చేస్తున్న కె.వి.రాజారావు

ఆమదాలవలస: ప్రపంచ తెలుగు మహాసభలో కుప్పిలి కవితా గానం పలువురిని ఆకట్టుకుంది. శనివారం విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో ప్రముఖ సాహితీ వేత్త గుత్తికొండ పూర్ణచంద్, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్లో జరిగిన కవి సమ్మేళనంలో ఆమదాలవలస పట్టణానికి చెందిన రచయిత కవి కుప్పిలి వెంకట రాజారావు 'జింక బాణం సంధిస్తే' అనే కవితను చదివి అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులపై అవగాహన

మెళియాపుట్టి: గిరిజనులు వారి హక్కులు, చట్టాల గుర్చి తెలుసుకోవాలని కొత్తూరు వెలుగు అసోసియేషన్ సభ్యులు పలువురు అన్నారు. శనివారం మండలంలోని మూలనేలబొంతు గ్రామంలో చట్టాలు, హక్కుల గుర్చి వివరించారు. 2016వ చట్టం ప్రకారం అటవీ హక్కులు, జీవనవిధానాన్ని తెలుసుకోవడానికి చట్టాలపై అవగాహన అవసరమన్నారు. చేపల పెంపకం, పోడు వ్యవసాయం తదితర అంశాల గుర్చి వివరించారు. ప్రభుత్వాలు గిరిజనులకు కల్పించిన హక్కులపై అవగాహన కల్పించారు.

అసోసియేషన్ సభ్యులు చిరంజీవులు, నాగరాజు, జగన్నాథం, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళి



మన్మోహన్ సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, సంస్థ ప్రతినిధులు

బూర్జ: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ దేశానికి గొప్ప సేవలందించారని పెద్దపేట ఆర్ఫ్ సంస్థ డైరెక్టర్ నూక సన్యాసిరావు అన్నారు. శనివారం ఆర్ఫ్ సంస్థ ఆవరణలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. సన్యాసిరావు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ వరుసగా రెండు పర్యాయాలు ప్రధాన మంత్రిగా, ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ చైర్మన్‌గా, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా ఇలా ఎన్నో పదవులు చేపట్టారన్నారు. దేశం గొప్ప వ్యక్తిని కోల్పోవడం విచారకరమన్నారు. హార్టీకల్చర్ రీసెర్చ్ సెంటర్ సీనియర్ సైంటిస్ట్ టి.రాజశేఖర్, ఆమదాలవలస కేవీకే సీనియర్ శాస్త్రవేత్త శ్రీహరి, ఉద్యానవనశాఖ అధికారి అయంతి, ఆర్ఫ్ సంస్థ సీఈఓలు బి.శంకరరావు, నూక అనూప్, సిబ్బంది పాల్గొన్నారు.

తోట రాములు నియామకంపై హర్షం

సరుబుజ్జిలి: జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ సభ్యునిగా తోట రాములు నియామకం పట్ల శనివారం పలువురు దళిత సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. దళితుల సంక్షేమం కోసం మరింత కృషిచేయాలని కోరారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో దళిత హక్కుల సంఘం నేతలు యడ్ల ఈశ్వరరావు, అదపాక గౌరినాయుడు, రావాడ వెంకటరావు, గుర్రాల చిన్నబాబు ఉన్నారు.

103 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సారవకోట: మండల కేంద్రంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 103 మందికి కిమ్స్ వైద్యులు కిల్లి సతీష్‌కుమార్, స్వప్న వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్‌తో పాటు ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు ఇచ్ఛాపురం సోమేశ్వరరావు, వైకుంఠరావు ఉన్నారు.

నూతన సంవత్సర సందడి



రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు



ప్రత్యేక రంగులతో సిద్ధం చేస్తున్న కేకులు

నరసన్నపేట: మండల కేంద్రంలో నూతన సంవత్సర సందడి మొదలైంది. పలురకాల కేక్‌లు సిద్ధమవుతున్నాయి. ముగ్గులు వేసేందుకు రంగులు మార్కెట్లోకి వచ్చాయి. శనివారం నుంచి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. 2025కి స్వాగతం పలుకుతూ.. 2024కి వీడ్కోలు పలకడానికి ప్రజలు సిద్ధమవుతున్నారు. స్వీట్ షాపులతోపాటు బేకరీల్లో కేక్‌లకు ఆర్డర్లు అధికంగా వస్తున్నాయి. కొత్త, కొత్త ఆకారాల్లో కేక్‌లు తయారు చేయాలని ఆర్డర్లు వస్తున్నాయని స్వీట్స్ దుకాణాల యజమానులు చెబుతున్నారు. కస్టమర్స్ అభిరుచులకు అనుగుణంగా కేక్‌లు తయారు చేస్తున్నామన్నారు. ఈ నెల 31న ప్రత్యేక ఆఫర్లు పెట్టేందుకు పలు స్వీట్ షాపులు సిద్ధమవుతున్నాయి.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పాతపట్నం: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం పాడ్యమి పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అష్టోత్తర శతనామావలితో పూజలు చేపట్టారు. పాతపట్నం, కొరసవాడ పరిసరాల ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

ప్రణాళికలతోనే శత శాతం ఉత్తీర్ణత



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏఎంఓ కోటిబాబు

కొత్తూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణ కోసం విద్యాశాఖ రూపొందించిన ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్‌లో వివరించిన సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలని ఉపాధ్యాయులకు ఐటీడీఏ అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) పి.కోటిబాబు ఆదేశించారు. మండలంలోని లబ్బ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించారు. పెండింగ్‌లో ఉన్న సిలబస్‌ను పూర్తిచేయాలన్నారు. విద్యార్థుల నోట్ బుక్‌లను పరిశీలించారు. పలు ప్రశ్నలు అగిడి విద్యా సమర్థ్యాల స్థాయిని తెలుసుకున్నారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.